సాక్షి
సూర్యాపేట

బుధవారం । 18 । డిసెంబర్ । 2024



అధిక వడ్డీ ఆశ చూపి

అధిక వడ్డీ ఆశ చూపి అప్పు తీసుకున్న వ్యక్తి తిరిగి చెల్లించలేక తన పొలాన్ని మధ్యవర్తులకు రిజిస్ట్రేషన్ చేశాడు. - 8లో



నీటి విడుదలకు సన్నాహాలు

మూసీ ఆయకట్టులో యాసంగి పంటల సాగుకు నీటిని విడుదల చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. - 10లో



ధాన్యం రాకను అడ్డుకోవాలి

ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా అడ్డుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. - 10లో

వణికించే చలిలోనే బతుకు పోరాటం



మంగళవారం తెల్లవారుజామున 5.15 గంటల సమయంలో చలిలో చిరువ్యాపారుల ప్రయాణం



మంగళవారం తెల్లవారుజామున 4.30 గంటలకు జిల్లా కేంద్రంలోని కూరగాయల మార్కెట్‌లో సందడి

చలి తీవ్రత పెరిగిపోతోంది. పగటి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. గజగజ వణికించే చలిలోనూ విభిన్న వర్గాల ప్రజలు తమ బతుకుపోరాటం కొనసాగిస్తున్నారు. జిల్లాలో పలుచోట్ల సాక్షి విజిట్ నిర్వహించగా చలి పంజా విసురుతున్న వేళ పారిశుద్ధ్య కార్మికులు, కూరగాయల వ్యాపారులు తమ పనుల్లో నిమగ్నమై కనిపించారు.

-సూర్యాపేట టౌన్, కోదాడ, హుజూర్‌నగర్, చిలుకూరు

- టీ కొట్టు వారినుంచి పేపర్‌బాయ్ వరకు చలిలోనే పనులు
- మున్సిపాలిటీల్లో రాత్రి వేళల్లో రక్షణ కవచాలు లేకుండానే రోడ్లను శుభ్రం చేస్తున్న కార్మికులు
- సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, చిలుకూరులో 'సాక్షి'విజిట్

హుజూర్‌నగర్‌లో ..

- హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని పారిశుద్ధ్య సిబ్బంది తెల్లవారుజామున 5 గంటలకే విధులకు హాజరవుతున్నారు.
- చలి నుంచి తమను కాపాడుకునేందు ముఖానికి వస్త్రాలు కట్టుకుని విధులు నిర్వర్తిస్తున్నారు.
- చలి నుంచి తట్టుకునేందుకు పారిశుద్ధ్య కార్మికులకు ఎలాంటి ప్రత్యేక దుస్తులు లేవు.
- హుజూర్‌నగర్ ప్రాంతంలో రెండు రోజులుగా చలి తీవ్రత ఎక్కువగా ఉంది.
- కనిష్ట ఉష్ణోగ్రతలు దాదాపు 22.3 డిగ్రీల సెల్సియస్‌గా నమోదవుతున్నాయి.
- పట్టణంలోని రోడ్లపై రాత్రిపూట 11 గంటల నుంచి 12 గంటల వరకు టిఫిన్ బండ్ల వారు మాత్రమే తమ వ్యాపారాలు కొనసాగిస్తున్నారు.
- 12 గంటలు దాటితే హుజూర్‌నగర్ పట్టణంలోని రోడ్లపై ఎవరూ కనిపించడం లేదు.



హుజూర్‌నగర్‌లో తెల్లవారుజామున చెత్త సేకరిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

కోదాడలో..

- కోదాడ పట్టణంలో తెల్లవారుజామున నాలుగున్నర నుంచి ఐదున్నర గంటల వరకు వీధుల్లో జనసంచారం తగ్గిపోయింది.
- ఉదయం వాకింగ్‌కు వెళ్లేవారు పూర్తిగా తగ్గిపోయారు. కోదాడ పట్టణంలో కూరగాయలు, పాలు అమ్మేవారు మంకీ క్యాప్‌లు పెట్టుకుని అక్కడక్కడ కనిపించారు. కోదాడ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు పలుచగా కనిపించారు.



కోదాడలో మంగళవారం తెల్లవారుజామున చలిలో వీధిని ఊడ్చుతున్న కార్మికులు

చిలుకూరులో..

- చిలుకూరులో ఉదయం పూట చలికి తట్టుకోలేక ప్రజలు చలి మంటలు వేసుకుంటున్నారు.
- ఎండ వచ్చిన తరువాతనే ఉదయం వాకింగ్‌కు వెళ్తున్నారు.

సూర్యాపేట పట్టణంలో..

- జిల్లా కేంద్రంలో రెండురోజులుగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.
- సాయంత్రం 6 గంటల నుంచి మురుసటి రోజు ఉదయం 7 గంటల వరకు ఇళ్ల నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి కనిపిస్తోంది.
- స్వెట్టర్లు ధరించినా చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజలు గజగజ వణుకుతున్నారు.
- సూర్యాపేట మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికులు రాత్రి వేళల్లో చలికి వణుకుతూ రోడ్లను శుభ్రం చేస్తున్నారు.
- రాత్రి వేళల్లో బస్సుల కోసం సూర్యాపేట్ హైటెక్ బస్టాండ్‌లో వేచిచూసే ప్రయాణికులు చలికి గజగజ వణికిపోతున్నారు.
- సూర్యాపేట పట్టణంలో పెట్రోలింగ్ చేసే పోలీసులు చలిలోనే విధులు నిర్వర్తిస్తున్నారు.
- గ్రామాల నుంచి వచ్చే కూరగాయలను హమాలీలు పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో చలిలోనే దిగుమతి చేసుకుంటున్నారు.
- పొగ మంచులోనే గ్రామాల నుంచి రైతులు ఆకు కూరలు, కూరగాయలు పట్టణానికి తీసుకొచ్చి విక్రయిస్తున్నారు.
- పారిశుద్ధ్య కార్మికులు, హమాలీలు, టీ కొట్టు వారు, పేపర్ బాయ్‌లు, కూరగాయల వ్యాపారులు, గ్రామాల నుంచి పట్టణానికి పాలు తీసుకొచ్చి విక్రయించేవారు చలిలోనే తమ బతుకు పోరు సాగిస్తున్నారు.
- సూర్యాపేటలో కొంతమంది చలి నుంచి ఉపశమనం పొందేందుకు చలిమంటలు వేస్తున్నారు.
- ఉదయం పాఠశాలలకు, కార్యాలయాలకు, వ్యవసాయ పనులకు వెళ్లాలంటే చలి గాలులకు విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు.



సూర్యాపేటలో హైవే వెంట సోమవారం రాత్రి ఒంటి గంట సమయంలో చలిలో టీ చేస్తూ..

- ఆటో కార్మికులు, డ్రైవర్లు చలిలోనే తమ దైనందిన కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు.
- జిల్లాలోని అనంతగిరి మండలం గోండ్రియాల గ్రామంలో మంగళవారం కనిష్ట ఉష్ణోగ్రత 19.9, తిరుమలగిరిలో గరిష్ట ఉష్ణోగ్రత 26.1 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయింది.



జిల్లా కేంద్రంలో సోమవారం రాత్రి 1.50 గంటలకు చలిలో రోడ్డు ఊడుస్తున్న మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులు

మరికొన్ని ఫొటోలు 8లో



సూర్యాపేటలోని జమ్మిగడ్డలో సోమవారం రాత్రి 8.30 గంటల సమయంలో స్వెటర్లు కొనుగోలు చేస్తున్న ప్రజలు



మంగళవారం తెల్లవారుజామున 4.39 గంటలకు కొత్త బస్టాండ్‌లో న్యూస్‌పేపర్ కట్టలను సరి చేసుకుంటున్న పేపర్‌బాయ్



తెల్లవారుజామున 4.40 గంటలకు పాలు అమ్మేందుకు వెళ్తున్న వ్యాపారి



తెల్లవారుజామున 5 గంటల సమయంలో సూర్యాపేట పట్టణంలో కూరగాయలు అమ్మేందుకు వెళ్తున్న రైతు

న్యూస్‌రీల్

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

భానుపురి (సూర్యాపేట) : ప్రభుత్వం ప్రతినెలా ఒకటో తేదీనే పెన్షన్ ఇస్తున్నప్పటికీ ఇతర సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.సీతారామయ్య అన్నారు. మంగళవారం సూర్యాపేట పట్టణంలోని కిరాణ ఫ్యాన్సీ అసోసియేషన్ భవన్‌లో నిర్వహించిన జాతీయ పెన్షనర్ల దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హెల్త్ కార్డులు, పీఆర్సీ, పెండింగ్ డీఏలు చెల్లించడం లేదన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్ సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరీ ఆఫీసర్ రవికుమార్, సుధా బ్యాంక్ ఎండీ పెద్దిరెడ్డి గణేశ్, డీసీబీ బ్యాంక్ మేనేజర్ నాగార్జున, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా జనరల్ సెక్రెటరీ రాంబాబు, అసోసియేట్ ప్రెసిడెంట్ రవీందర్‌రెడ్డి, దేవదానం, ట్రెజరర్ హమీద్ ఖాన్, సూర్యాపేట మండల అధ్యక్షుడు శ్యాంసుందర్ రెడ్డి, సెక్రటరీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలి



సూర్యాపేట సబ్ జైలును సందర్శించిన జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీవాణి

చివ్వెంల(సూర్యాపేట) : ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి పి.శ్రీవాణి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సబ్ జైలును ఆమె సందర్శించి ఖైదీలతో మాట్లాడారు. న్యాయవాదులను పెట్టుకోలేనివారు జిల్లా న్యాయసేవాధికార సంస్థలో దరఖాస్తు చేసుకుంటే ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం ఖైదీలకు అందించే మధ్యాహ్న భోజనం, వారికి కేటాయించిన గదులను పరిశీలించారు. ఆమె వెంట డిఫెన్స్ కౌన్సిల్స్ వసంత సత్యనారాయణ పిళ్లే యాదవ్, బొల్లెద్దు వెంకటరత్నం, బట్టిపల్లి ప్రవీణ్‌కుమార్, పెండెం వాణి, యారగాని వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జిల్లా క్రీడల అధికారి రామచందర్‌రావు

సూర్యాపేటటౌన్ : సీఎం కప్ జిల్లాస్థాయి క్రీడా పోటీలను మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జిల్లా క్రీడల అధికారి రామచందర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21 వరకు క్రీడలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కబడ్డీ పోటీలకు 56 బాలబాలికల టీమ్‌లు, బాస్కెట్ బాల్, షటిల్ పోటీల్లో 102 మంది క్రీడాకారులు పాల్గొన్నారని, మొత్తం 675 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ అజీమ్ బాబా, పీఈటీ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేష్, రామ్మోహనచారి, సీతారామరెడ్డి, ఎస్‌కె.ఫారుక్ పాల్గొన్నారు.

మానవ హక్కుల జిల్లా సంయుక్త కార్యదర్శిగా సతీష్



నడిగూడెం : జాతీయ మానవ హక్కుల సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శిగా కాగిత రామచంద్రాపురం గ్రామానికి చెందిన దోసపాటి సతీష్‌ను నియమిస్తూ ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మంగలపల్లి హుస్సేన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ.. మానవ హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

30లోగా పరీక్ష ఫీజు చెల్లించాలి

రామగిరి(నల్లగొండ): డాక్టర్ బీఆర్.అంబేద్కర్ యూనివర్సిటీలో 2015–16 బ్యాచ్‌కు ముందు యూజీ థియరీ అండ్ ప్రాక్టికల్, ఎంబీఏ కోర్సులు చదివిన విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించాలని నల్లగొండ రీజనల్ కోఆర్డినేటర్ డాక్టర్ అంతటి శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూజీ, ఎంబీఏ విద్యార్థులు 30వ తేదీ లోపు ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. జనవరి 4వ తేదీలోపు రూ.500 అదనపు రుసుముతో ఫీజును చెల్లించవచ్చని తెలిపారు.

హామీని అమలు చేయాలి

భానుపురి : వ్యవసాయ కార్మికులకు ఏడాదికి రూ.12వేలు ఇస్తామని ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు తక్షణమే పథకాన్ని ప్రారంభించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాల ధనుంజయనాయుడు కోరారు. మంగళవారం సూర్యాపేట పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ అనుబంధం) జిల్లా ఆఫీసు బేరర్ల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రేమిడాల రాజు, ఉపాధ్యక్షుడు రావుల సత్యం, గౌరవ అధ్యక్షుడు ఎండీ ఎక్బాల్, స్టాలిన్, జడ వెంకన్న సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించండి

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

భానుపురి (సూర్యాపేట) : ధరణి పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. మంగళవారం సూర్యాపేట ఆర్డీఓ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని ఎలక్షన్ సెల్‌ను పరిశీలించి సిబ్బందికి ఫారం–6, 7, 8లపై పలు సూచనలు చేశారు. అలాగే రికార్డు గదిని పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. అనంతరం సూర్యాపేటలో కేంద్రీయ విద్యాలయం తాత్కాలిక భవనం ఏర్పాటుకు ఎస్వీ కళాశాలను పరిశీలించారు. తదుపరి సఖీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి కేంద్రం ద్వారా ఇప్పటి వరకు గృహహింస చట్టంకింద నమోదైన కేసులు, న్యాయ సలహాల వివరాలు, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ వేణుమాధవ్, ఎస్వీ కాలేజీ ప్రిన్సిపాల్ వెంకటేశులు, సఖీ కేంద్రం పరిపాలన అధికారి శైలజ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో సిజేరియన్లు తగ్గించాలి

జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిజేరియన్లు తగ్గించాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గల తన చాంబర్‌లో డీఎంహెచ్‌ఓ కోటాచలంతో కలిసి వైద్య, ఆరోగ్య శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సౌకర్యాలు ఉన్నందున అధికారులు, ఆశా కార్యకర్తలు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ఎక్కువ ప్రసవాలు అయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ ఉమామహేశ్వరి, డాక్టర్ నాజియా, డాక్టర్ జయ మనోహరి, డాక్టర్ శ్రీశైలం, డాక్టర్ అనిత రాణి, డాక్టర్ సతీష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీఓ కార్యాలయంలో ఎలక్షన్ సెల్ గదిని పరిశీలిస్తున్న కలెక్టర్

మోడల్ అంగన్‌వాడీ కేంద్రంగా తీర్చిదిద్దాలి

భానుపురి (సూర్యాపేట) : జిల్లాలోని ప్రతి అంగన్‌వాడీ కేంద్రాన్ని మోడల్ కేంద్రంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా, శిశు, వికలాంగుల వయోవృద్ధుల, ట్రాన్స్‌జెండర్ శాఖ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగా ఏర్పడిన గ్రామపంచాయతీల్లో అంగన్‌వాడీల మంజూరుకు, జిల్లాలో మహిళా ప్రాంగణం, వర్కింగ్ ఉమెన్ హాస్టల్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. డీడబ్ల్యూఓ నరసింహారావు, సీడీపీఓలు, మహిళాశక్తి కోఆర్డినేటర్, సఖి సెంటర్ కోఆర్డినేటర్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు

పెన్‌పహాడ్ మండలం దోసపాడు గ్రామంలోని జంగాలపడిగ కాలనీలో ఇటీవల షార్ట్ సర్క్యూట్‌తో ఇళ్లు కాలిపోయిన నాలుగు కుటుంబాలకు రూ.10వేల చొప్పున కలెక్టర్ కలెక్టరేట్‌లో అందించారు. అలాగే మొదటి విడతలోనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ లాలు, ఆర్‌ఐ రంజిత్ రెడ్డి, పంచాయతీ సెక్రటరీ సతీష్ పాల్గొన్నారు.

ఆలయాలకు జియో ట్యాగింగ్

- దేవాలయాల సమాచారం అంతా ఇక ఆన్‌లైన్‌లో నమోదు
- దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలో 432 ఆలయాలు
- ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు


హుజూర్‌నగర్ : దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలోని ఆలయాల పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఆలయాల పూర్తి సమాచారం ఇంటర్‌నెట్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. జిల్లాలోని ఆలయాలకు సంబంధించి ఈ ప్రక్రియ ఇప్పటికే మొదలుపెట్టారు. జిల్లాలోని ఆలయాలను సులభంగా గుర్తించడమే కాకుండా వాటి పరిధిలోని భూములు, ఆస్తుల వివరాలు తక్షణమే తెలిసేలా వెబ్‌సైట్‌లో నమోదు చేస్తున్నారు. అన్ని రకాల ఆలయాల సమాచారాన్ని గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం (జీపీఎస్)తో అనుసంధానం చేయనున్నారు. ఆలయాల సమాచారం గూగుల్ మ్యాప్స్‌లో పొందేలా త్వరలోనే అందుబాటులోకి తీసుకురానున్నారు.

వార్షిక ఆదాయాన్ని బట్టి కేటగిరీ వారీగా..

జిల్లాలో దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలో రిజిస్టర్ అయిన ఆలయాలు 432 వరకు ఉన్నాయి. వాటికి వచ్చే వార్షిక ఆదాయాన్ని బట్టి ఆలయాలను వివిధ కేటగిరీలుగా విభజించారు. వాటిలో 6ఏ, 6బీ, 6సీ వారీగా ఉన్నాయి. 6ఏ ఆలయాలుగా–4 6బీ –11 ఆలయాలుగా నమోదయ్యాయి. 6సీ పరిధిలో 147 ఆలయాలు ఉన్నాయి. అన్ని ఆలయాల పరిధిలో దాదాపు 7,332.14 ఎకరాల భూమి ఉంది. వాటిలో సుమారు 15 వందల ఎకరాల భూమి కబ్జాకు గురైనట్లు అధికారులు గుర్తించారు. కబ్జాదారుల్లో కొందరికి నోటీసులు ఇవ్వగా మరికొన్ని కోర్టు కేసుల్లో ఉన్నాయి.

భూముల సరిహద్దులకు మార్కింగ్ ..

- ఆలయం ఎక్కడ ఉంది.. దాని సరిహద్దులు, దాని పరిధిలోని భూములు ఏఏ సర్వే నంబర్‌లో ఉన్నాయి.. ఇలా ప్రతీ అంశం ప్రజలకు తెలిసేలా ఇంటర్‌నెట్‌లో పొందుపరుస్తున్నారు.
- దేవాదాయ శాఖ పరిధిలో పబ్లికేషన్ రిజిస్టర్ అయిఉన్న ఆలయాలు, ధూపదీప నివేదన పథకంతోపాటు అన్ని రకాల ఆలయాలను జియో ట్యాగింగ్ చేస్తున్నారు.
- గూగుల్ మ్యాప్స్‌లో ఏ ఆలయానికి సంబంధించిన సమాచారం కావాలన్నా.. దానిని టైప్ చేస్తే చాలు పూర్తి సమాచారం వస్తుంది.



మేళ్లచెరువులోని శ్రీ స్వయంభూ శంభులింగేశ్వర స్వామి ఆలయం

గూగుల్ మ్యాప్‌లో సెర్చ్ చేస్తే చాలు

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ఆలయాల సమాచారం పక్కాగా తెలిసేలా జియో ట్యాగింగ్ చేస్తున్నాం. భవిష్యత్‌లో ఏదైనా ఆలయ భూమి కబ్జాకు గురైతే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తెలుసుకోవచ్చు. గూగుల్ మ్యాప్‌లో సెర్చ్ చేస్తే చాలు అక్షాంశాలు, రేఖాంశాలతో ఆ ప్రదేశం చూపిస్తుంది. ఆలయ భూములు, ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా రక్షించేందుకు ఆ ప్రక్రియ దోహద పడుతుంది.

–సులోచన, సహాయ కమిషనర్, దేవాదాయ శాఖ ఉమ్మడి నల్లగొండ జిల్లా

- భూములు, ఆస్తుల వివరాలను సైతం ఫొటోల ద్వారా సేకరించి ప్రభుత్వ వెబ్‌సైట్ నుంచి జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం (జీఐఎస్) ద్వారా పరిశీలించి ఆయా భూముల సరిహద్దులను మార్కింగ్ చేస్తున్నారు.
- భవిష్యత్‌లో మొబైల్ యాప్‌ను రూపొందించేందుకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.
- దేవాదాయ శాఖ ఈఓలు, సిబ్బందితో జీపీఎస్ మ్యాప్ కెమెరా యాప్‌లో ఫొటోలను తీయించి అక్షాంశాలు, రేఖాంశాలు, ప్రాంతం (లొకేషన్) ఆధారంగా సమాచారాన్ని దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయానికి పంపిస్తున్నారు. అక్కడ జియో ట్యాగింగ్‌తో ఆలయాలకు సంబంధించిన కోఆర్డినేట్ చేసి నిర్ధారిస్తారు.

సైన్స్ ఫెయిర్‌ను విజయవంతం చేయాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్

కోదాడ: విద్యార్థుల్లో సైన్స్‌పై అవగాహన పెంచడానికి నిర్వహిస్తున్న జిల్లా సైన్స్‌ఫెయిర్ (విద్యా వైజ్ఞానిక ప్రదర్శన)ను విజయవంతం చేయాలని జిల్లా విద్యాధికారి అశోక్ కోరారు. కోదాడలోని సీసీ రెడ్డి విద్యానిలయంలో ఈ నెల 19, 20వ తేదీల్లో నిర్వహించే సైన్స్‌ఫెయిర్‌పై ఏర్పాటు చేసిన కమిటీలతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. రెండు రోజులపాటు జరిగే ఈ ప్రదర్శన విజయవంతం చేయడానికి 23 కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దాదాపు ఐదు వేల మంది విద్యార్థులు జిల్లా సైన్స్‌ఫెయిర్‌లో పాల్గొనే అవకాశం ఉందన్నారు. కోదాడ ఎంఈఓ సలీం షరీఫ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా సైన్స్ అధికారి ఎల్. దేవరాజ్, సూర్యాపేట ఎంఈఓ శ్రీనివాసరావు, వివిధ కమిటీల కన్వీనర్లు, కో కన్వీనర్లు పాల్గొన్నారు.



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న డీఈఓ అశోక్

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

మునగాల: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మోడల్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈఓ అశోక్ సూచించారు. మంగళవారం మునగాల మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌ను ఆకస్మికంగా సందర్శించారు. పదో తరగతి క్లాస్‌రూమ్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులతో చర్చించారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఇంగ్లిష్ గ్రామర్‌పై పట్టు సాధించాలన్నారు. ఆంగ్లం బోధించే ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బూర సైదయ్యగౌడ్, ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

క్లుప్తంగా

యజ్ఞం నిర్వహణకు అనుమతి ఇవ్వాలని వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్ రెడ్డి తదితరులు

నల్లగొండ టూటౌన్: నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని గ్రామ కంఠం భూమి(అంగడి స్థలం)లో హనుమత్ గాయత్రీ యజ్ఞం నిర్వహించుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ఆంజనేయ స్వాములు, నార్కట్‌పల్లి పరిరక్షణ సమితి తరఫున మంగళవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి, బీజేవైఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి పజ్జూరు వెంకటరెడ్డి, నాయకులు కొరవి శంకర్, మెడబోయిన శ్రీనివాస్, నడింపల్లి శ్రవణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ చౌర్యం.. పలువురిపై కేసు నమోదు

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండల వ్యాప్తంగా మంగళవారం విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో ఇంటింటి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 12 బృందాలు మండలంలోని 373 ఇళ్లను తనిఖీ చేయగా 22 మంది మీటరు లేకుండా విద్యుత్ వాడుతుండటంతో వారిపై కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీలను విద్యుత్ శాఖ జిల్లా ఎస్ఈ ఫ్రాంక్లిన్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో డీపీ డీఈ స్వామినాయక్, ఏడీఈ రామునాయక్, స్థానిక ఏఈ వాస శ్రీకాంత్, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

భువనగిరి: భువనగిరి పట్టణంలోని జిల్లా కేంద్ర ఆస్పత్రి వద్ద మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. జిల్లా కేంద్ర ఆస్పత్రి ఎదురుగా గల ఎలిమినేటి మాధవరెడ్డి విగ్రహం సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. మృతుడి వయస్సు సుమారు 70 నుంచి 75 సంవత్సరాలు ఉంటుందని, అనారోగ్యంతో పాటు ఆహారం తీసుకోకపోవడంతో మృతిచెందినట్లు తెలుస్తుందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8712579973, 8712662803 నంబర్లను సంప్రదించాలని పోలీసులు సూచించారు.

బస్సు దిగుతూ జారిపడి మహిళకు గాయాలు

సూర్యాపేటటౌన్: ఆర్టీసీ బస్సు దిగుతుండగా మహిళ జారిపడడంతో గాయాలయ్యాయి. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగింది. జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన బొల్లం స్వరాజ్యం మంగళవారం సూర్యాపేట పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద ఆర్టీసీ బస్సు దిగుతుండగా అదుపుతప్పి కిందపడటంతో ఆమె చేయి టైరు కింద పడింది. దీంతో ఆమె చేయికి గాయం కావడంతో స్థానికులు వెంటనే ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

• గజగజ వణికిస్తున్న చలిలో..


సూర్యాపేట హైటెక్ బస్టాండ్‌లో బస్సు కోసం వేచి ఉన్న ప్రయాణికులు


సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డలో స్వెట్టర్లు కొనుగోలు చేస్తున్న ప్రజలు


సూర్యాపేట హైటెక్ బస్టాండ్‌లో రాత్రి వేళ నిద్రిస్తున్న ప్రయాణికులు


సూర్యాపేట హైటెక్ బస్టాండ్‌లో రాత్రి వేళ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పట్టణ పోలీసులు


సూర్యాపేట కొత్త బస్టాండ్ సమీపంలో రాత్రి చలి తీవ్రత తట్టుకోలేక చలి మంట వేసుకున్న ఆటో డ్రైవర్లు


సూర్యాపేట మార్కెట్‌లో అర్ధరాత్రి కూరగాయలు దిగుమతి చేస్తున్న హమాలీలు


సూర్యాపేటలో ఉదయం వేళ చలికి టీ తాగుతున్న ప్రజలు

అధిక వడ్డీ ఆశ చూపి మోసం

- 128 మంది నుంచి రూ.8కోట్ల మేర అప్పు తీసుకున్న ఘనుడు
- బాధితులు గొడవ చేయడంతో మధ్యవర్తుల పేరిట పొలం రిజిస్ట్రేషన్

చిలుకూరు: అధిక వడ్డీ ఆశ చూపి అప్పు తీసుకున్న వ్యక్తి తిరిగి అప్పు చెల్లించలేక తన పొలాన్ని మధ్యవర్తుల పేరు మీద రిజిస్ట్రేషన్ చేశాడు. అయితే ఆ పొలం అమ్మగా వచ్చే డబ్బులు అప్పు తీర్చేందుకు సరిపోకపోగా.. ఆ పొలంలో తమకు వాటా ఉందని అతడి బంధువులు దున్నుకోవడంతో బాధితులు మంగళవారం చిలుకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. చిలుకూరు మండలం రామాపురం గ్రామానికి చెందిన కిషోర్ కొంతకాలం హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసి స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. ఆ తర్వాత వ్యాపారం చేయడంతో పాటు ఫైనాన్స్ బిజినెస్ చేశాడు. అతని దగ్గర ఉన్న డబ్బులకు తోడు తెలిసివాళ్ల దగ్గర వడ్డీకి డబ్బులు తీసుకొని ఫైనాన్స్ నడిపించేవాడు. ప్రారంభంలో అందరికీ ధిక వడ్డీతో డబ్బులు మంచిగానే ఇచ్చాడు. దీంతో


చిలుకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధితులు

రామాపురంతో పాటు చుట్టుపక్కల గ్రామాలైన ఆర్లెగూడెం, కోదాడలోనే కాకుండా అతని బంధువుల్లో కూడా ఇతడిపై నమ్మకం కలిగింది. అధిక వడ్డీ వస్తుండడంతో అతను ఎంత అడిగితే అన్ని డబ్బులు ఇవ్వడమే కాక, డబ్బులు ఉన్న వాళ్లు అతనికి పిలిచి మరీ ఇచ్చారు.

రూ.8 కోట్ల మేర అప్పు..

కిషోర్ రామాపురం, ఆర్లెగూడెం, కోదాడకు చెందిన వాళ్లు కాకుండా అతని బంధువులు మొత్తం 128 మంది నుంచి రూ.8 కోట్ల మేర అప్పు తీసుకున్నాడు. ఆరునెలల క్రితం అతడు ఐపీ పెడుతున్నట్లు గ్రామంలో పుకార్లు వచ్చాయి. దీంతో డబ్బులు ఇచ్చిన వాళ్లందరూ ఒక్కసారిగా డబ్బులు అడగడంతో అతడి వ్యవహారం మొత్తం బయటపడింది. ఒక్కొక్కరి వద్ద నుంచి కనిష్టంగా రూ.లక్ష, ఒకరి వద్ద నుంచి గరిష్టంగా రూ.80 లక్షల వరకు తీసుకున్నాడు. బాధితులు డబ్బులు తిరిగి ఇవ్వమని గొడవ చేస్తుండడంతో గ్రామానికి చెందిన పెద్దమనుషులు అతడితో మాట్లాడి అతడి పేరు మీద ఆర్లెగూడెం శివారులో ఉన్న 6 ఎకరాల భూమిని అమ్మి బాధితులకు డబ్బులు ఇవ్వాలని తీర్మానించారు. ఈ మేరకు 6 ఎకరాల భూమిని ఇద్దరు మధ్యవర్తుల పేరు మీద రిజిస్ట్రేషన్ చేశారు. అంతేకాక రామాపురంలోని 2 ఎకరాలు, మునగాల మండలం ఆకుపాముల వద్ద ఉన్న 2 ఎకరాలు భూమి మొత్తం సుమారుగా 10 ఎకరాలు భూమిని అమ్మి బాధితులకు డబ్బులు ఇవ్వాలని పంచాయితీ తీర్మానం చేశారు. కానీ ఇప్పటివరకు ఆ భూములు అమ్మలేదని, దీంతో తమ డబ్బులు తమకు వస్తాయా లేవా అని బాధితులు లబోదిబోమంటున్నారు. పోలీసులు స్పందించి పూర్తిస్థాయి విచారణ చేసి న్యాయం చేయాలని పలువురు బాధితులు కోరుతున్నారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాల కూల్చివేత


జేసీబీతో అక్రమ కట్టడాలను కూల్చివేయిస్తున్న అధికారులు


తహసీల్దార్ హరిబాబుతో వాగ్వాదం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్

- తన సోదరి భూమిలో ఫెన్సింగ్ తొలగించడంతో తహసీల్దార్‌తో వాగ్వాదానికి దిగిన మున్సిపల్ చైర్మన్
- అది ప్రభుత్వ భూమి కావడంతోనే తొలగించామంటున్న అధికారులు

మిర్యాలగూడ: మిర్యాలగూడ పట్టణంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను అధికారులు తిరిగి స్వాధీనం చేసుకుంటున్నారు. ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మించిన కట్టడాలు, ఫెన్సింగ్‌ను తొలగించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. మిర్యాలగూడ పట్టణంలోని నార్కట్‌పల్లి–అద్దంకి రహదారి వెంట సర్వే నంబర్ 626లోని ప్రభుత్వ భూమిని మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ సోదరి రాయపూడి భవాని ఆక్రమించినట్లు గుర్తించిన రెవెన్యూ, పోలీసు అధికారులు మంగళవారం సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ ఆదేశాల మేరకు ఆ సర్వే నంబర్‌లో వేసిన ఫెన్సింగ్‌ను, ఇతర కట్టడాలను తొలగించారు.

ఆక్రమణకు గురైన సుమారు మూడు గుంటల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సమయంలో మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, తహసీల్దార్ హరిబాబు మధ్య వాగ్వాదం జరిగింది. దీని విలువ సుమారు రూ.కోటి ఉంటుందని తెలుస్తోంది. ఆ రహదారి వెంట తాపీ, సెంట్రింగ్, వడ్రంగి సంఘాలు నిర్మించిన గదిని జేసీబీ సహాయంతో తొలగించి 12గుంటల భూమిని స్వాధీనం చేసుకున్నారు. అక్రమ నిర్మాణాల తొలగింపును సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ స్వయంగా పర్యవేక్షించారు. సుమారు నాలుగు గంటల పాటు అక్రమ కట్టడాల కూల్చివేతలు జరిగాయి.

ప్రభుత్వ భూమి కబ్జా చేస్తే కూల్చివేశాం

అద్దంకి–నార్కట్‌పల్లి రహదారిపై సర్వే నంబర్ 626లో ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేసినట్లు మా విచారణలో తేలింది. కోట్ల రూపాయల విలువ చేసే భూమిని కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– హరిబాబు, తహసీల్దార్

నోటీసులు ఇవ్వకుండానే కూల్చేశారు

అద్దంకి–నార్కట్‌పల్లి రహదారి వెంట నా సోదరి రాయపూడి భవాని 2012లో పట్టా భూమిని కొనుగోలు చేసింది. సర్వే నంబర్ 711లో 22 గుంటల భూమిని కొనుగోలు చేశాం. అప్పుడే ఫెన్సింగ్ ఏర్పాటు చేశాం. ఇప్పుడు రెవెన్యూ అధికారులు వచ్చి ప్రభుత్వ భూమి అని మేము వేసిన ఫెన్సింగ్‌ను కనీసం సమాచారం ఇవ్వకుండానే తొలగించారు. అధికారుల చర్యలు కక్ష సాధింపు చర్యలుగా ఉన్నాయి.

– తిరునగరు భార్గవ్, మున్సిపల్ చైర్మన్

మద్యం మత్తులో యువకుడి ఆత్మహత్య


రాకేష్ (ఫైల్)

మిర్యాలగూడ టౌన్: మద్యం మత్తులో ఓ యువకుడు ఎలుకల నివారణ ట్యాబెట్లు మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ పిల్లి లోకేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం బాదలాపురం గ్రామానికి చెందిన కన్నెంకటి రాకేష్(24) గూడూరు గ్రామ శివారులోని ఆర్ఎస్‌వీ రైస్‌మిల్లులో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. రోజుమాదిరిగానే రాకేష్ సోమవారం కూడా మిల్లుకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. డ్యూటీకి వెళ్లిన కుమారుడు రాత్రి వరకు కూడా ఇంటికి రాకపోవడంతో అతడి తండ్రి కుమారస్వామి భయాందోళనకు గురై రాకేష్ మిత్రుడు నల్లమేకల శ్రీనివాస్‌తో కలిసి గాలిస్తుండగా మంగళవారం ఉదయం గూడూరు గ్రామ శివారులో ఖాళీ స్థలంలో రాకేష్ విగతజీవిగా ఉండటం చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ పిల్ల లోకేష్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా.. మృతదేహం వద్ద బీరు బాటిల్‌తో పాటు ఎలుకల నివారణకు ఉపయోగించే ట్యాబ్లెట్లు ఉండటం గమనించారు. రాకేష్ మిల్లుకు సరిగా వెళ్లడం లేదని కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి వివాహం కాలేదు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మిరప పంటను ధ్వంసం చేసిన గుర్తుతెలియని వ్యక్తులు


గడ్డి మందు పిచికారీ చేయడంతో వాడిపోయిన మిరప పంట

నాగారం: గుర్తుతెలియని వ్యక్తులు మిరప పంటపై గడ్డి మందు పిచికారీ చేసి ధ్వంసం చేశారు. ఈ ఘటన సోమవారం రాత్రి నాగారం మండల కేంద్రంలో జరిగింది. బాధిత రైతుల తెలిపిన వివరాల ప్రకారం.. నాగారం మండల కేంద్రానికి చెందిన రైతు బొబ్బిలి కనకయ్య ఎకరం భూమిలో మిర్చి పంట సాగు చేశాడు. సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు మిర్చి పంటపై గడ్డి మందు పిచికారీ చేయడంతో పంట పూర్తిగా ధ్వంసమైంది. ఈ మిర్చి పంట విలువ సుమారు రూ.3లక్షల వరకు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు. బాధిత రైతు మంగళవారం నాగారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం. ఐలయ్య తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి బలవన్మరణం


బాలరాజు (ఫైల్)

రామన్నపేట: ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురైన ఉరేసుకుని వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెల్లంకి గ్రామానికి చెందిన వనం బాలరాజు(38) చేనేత వృత్తి మీద ఆధారపడి జీవిస్తున్నాడు. అతడికి భార్య రాజేశ్వరి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆర్థిక సమస్యలతో భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు రావడంతో కొద్దిరోజులుగా రాజేశ్వరి తన పిల్లలతో కలిసి అదే గ్రామంలో తన తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. ఆర్థిక ఇబ్బందులతో మద్యానికి బానిసైన బాలరాజు మనస్తాపానికి గురై మంగళవారం ఉదయం ఇంట్లో దూలానికి చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పాఠశాల నుండి వచ్చిన బాలరాజు పెద్ద కుమార్తె మధుబాల తండ్రి దూలానికి వేలాడుతుండటం చూసి ఏడ్చుకుంటూ తల్లి వద్దకు పరుగెత్తి విషయం చెప్పింది. ఆమె స్థానికులతో కలిసి ఇంటికి వెళ్లి చూడగా అప్పటికే బాలరాజు మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి. మల్లయ్య తెలిపారు.

ఇసుక డంప్ సీజ్


ఇసుక డంప్‌ను సీజ్ చేస్తున్న తహసీల్దార్

మద్దిరాల: మండల పరిధిలోని ముకుందాపురం గ్రామ శివారులోని సమ్మక్క సారక్క గద్దెల వద్ద ముత్యాలమ్మ బండలకు సమీపంలో అక్రమంగా నిల్వ ఉంచిన 50 ట్రక్కుల ఇసుకను తహసీల్దార్ అమీన్‌సింగ్ మంగళవారం పరిశీలించి సీజ్ చేశారు. పంచనామా చేసి ఇసుక డంప్‌ను పంచాయతీ కార్యదర్శి వెంకటేక్‌కి అప్పజెప్పినట్లు తెలిపారు. గ్రామస్తులు అక్రమంగా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ హెచ్చరించారు.

దొంగిలించిన ఆటోతో పట్టుబడిన నిందితులు

వలిగొండ : ఆటోను దొంగిలించి అదే ఆటోలో తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను మంగళవారం వలిగొండ మండలం నాగారం వై జంక్షన్ వద్ద మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగారం వై జంక్షన్ వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా.. నంబర్ ప్లేట్ లేని ఆటోలో వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను ఆపగా.. వారు పొంతన లేని సమాధానాలు చెప్పడంతో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారిని విచారించగా ఆటోను దొంగతనం చేసిన పక్క రాష్ట్రంలో అమ్మేందుకు వెళ్తున్నట్లు ఒప్పుకున్నారు. నిందితులు సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం పఠాన్‌చెర్వు కుమ్మరిబస్తీకి చెందిన చెన్న సత్యనారాయణ, చెన్న సురేష్‌గా పోలీసులు గుర్తించారు. వీరిద్దరు 8వ తేదీన భువనగిరిలో ఆటోను కిరాయికి మాట్లాడుకొని వేములకొండకు వెళ్లి తిరుగు ప్రయాణంలో వలిగొండ–భువనగిరి మార్గంలో ఆటో డ్రైవర్‌కు మద్యం తాగించి అతడిని బెదిరించి ఆటోను దొంగిలించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యుగంధర్ తెలిపారు.

పట్టపగలు రెండు ఇళ్లలో చోరీ


ఆధారాలు సేకరిస్తున్న ఎస్ఐ

నాగారం: మండల పరిధిలోని నాగారంబంగ్లాలో రెండు ఇళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగారం బంగ్లాకు చెందిన కన్నెబోయిన కేశవులు కెనరా బ్యాంక్‌లో అటెండర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం కేశవులు బ్యాంక్‌కు వెళ్లగా, అతడి భార్య ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లింది. ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గమనించి గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి వెనుక వైపు ప్రహరీ దూకి కట్టర్ మిషన్‌తో తలుపును కట్ చేసి లోపల వేసిన గడిని చేతితో తీసి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాలో దాచిన రూ.17వేల నగదు ఎత్తుకెళ్లారు. అనంతరం ఆ ఇంటి పక్కనే ఉన్న గంట మల్లేష్ ఇంటి తాళాన్ని పగులగొట్టి 5గ్రాముల బంగారం, 20తులాల వెండి, రూ.5వేల నగదు అపహరించారు. మరో సూట్‌కేసును బయటికి తీసుకువెళ్లి తెరిచి, దానిలో ఏమీ లేకపోవడంతో చెట్ల పొదల్లో పడేశారు. బాధితులు మంగళవారం నాగారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం. ఐలయ్య తెలిపారు. మంగళవారం ఫోరెన్సిక్ నిపుణులు చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించి ఆధారాలు సేకరించారు.

యువకుడి అదృశ్యం

- కృష్ణా నదిలో దూకి ఆత్మహత్య చేసుకుంటానని కుటుంబ సభ్యులకు వీడియో కాల్


శంకర్

మిర్యాలగూడ: తనకు కారు కొనివ్వకపోతే కృష్ణా నదిలో దూకి ఆత్మహత్య చేసుకుంటానని ఓ యువకుడు కుటుంబ సభ్యులకు వీడియోల్ కాల్ చేసి అదృశ్యమయ్యాడు. వాడపల్లి ఎస్ఐ హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం శూన్యపహాడ్ గ్రామానికి చెందిన రమావత్ శంకర్(25) సెల్ టవర్ల నిర్మాణ సంస్థలో కూలీ పనికి వెళ్తుంటాడు. శంకర్ తనకు బైక్‌ను కొనివ్వాలంటూ తల్లిదండ్రులపై ఒత్తిడి తేవడంతో ఆరు నెలల క్రితం అతడికి బైక్ కొనిచ్చారు. ఇటీవల తనకు కారు కావాలంటూ తల్లిదండ్రులను అడగగా కటుంబ ఆర్థిక పరిస్థితి బాగోలేదని నచ్చజెప్పారు. అయినా వినకుండా రెండు రోజుల క్రితం తనకు కారు కొనివ్వకపోతే చనిపోతానంటూ శంకర్ తన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి చెప్పడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు దామరచర్ల శివారులో శంకర్‌ను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. తిరిగి మంగళవారం శంకర్ దామరచర్ల మండలం వాడపల్లి వద్ద కృష్ణా నదిలో దూకి తాను చనిపోతున్నానంటూ కుటుంబ సభ్యులకు వీడియో కాల్ చేయడంతో అప్రమత్తమైన కుటుంబ సభ్యులు కృష్ణానది వద్దకు చేరుకోగా.. వాడపల్లి బ్రిడ్జి పక్కన శంకర్ చెప్పులు, సెల్‌ఫోన్ గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు అక్కడికి చేరుకొని నదిలో దూకి ఉండవచ్చనే అనుమానంతో నదిలో గాలింపు చర్యలు చేపట్టారు.

కొనసాగుతున్న ధనుర్మాస ఉత్సవాలు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం రెండో రోజు గోదాదేవిని ప్రత్యేకంగా అలంకరించి రెండో పాశురాన్ని పఠించారు. అమ్మవారికి మహిళా భక్తులు మంగళహారతులతో నీరాజనాలు పాడారు. ధనుర్మాసంలో గోదాదేవికి జరిపించే విశేష పూజలు, పాశురాలకు సంబంధించిన విశిష్టతను ప్రధానార్చకులు భక్తులకు వివరించారు.


గోదాదేవికి హారతి ఇస్తున్న ప్రధానార్చకుడు

సాక్షి స్పెల్‌బీలో 'జయ' విద్యార్థుల ప్రతిభ


సూర్యాపేటటౌన్: స్పెల్‌బీకి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న జయ స్కూల్ యాజమాన్యం


కోదాడ: స్పెల్‌బీకి ఎంపికైన నందును అభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్ వేణు

సూర్యాపేటటౌన్: సాక్షి మీడియా ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సాక్షి ఇండియా స్పెల్‌బీ–2024 పోటీల్లో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జయ ఒలింపియాడ్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర స్థాయిలో 22 మంది విద్యార్థులు సెమీ ఫైనల్‌కు సెలెక్టయ్యారని పాఠశాల కరెస్పాండెంట్ జయ వేణుగోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 5వ తరగతి నుంచి కె. సాయి సాత్విక్, జి. సుదీప్త, ఇ. అనీష్, పి. వేదాన్షి, టి. శ్రేయాన్ ప్రశస్త్, 6వ తరగతి నుంచి ఎస్. శశాంక్ రెడ్డి, డి. నిహారిక, సీహెచ్. నందు, ఎండీ. జీషాన్, 7వ తరగతి నుంచి పి. అనన్యరెడ్డి, సీహెచ్. ఉత్తేజ్ గౌడ్, జి. నాగకార్తికేయ, ఎం. దీక్ష, ఇ. అవంతిక, బి. సాన్విక, సీహెచ్. శ్రేష్ఠరెడ్డి, ఎస్‌కే. రిహానా, 8వ తరగతి నుంచి ఎ. వైదుష్య, 9వ తరగతి నుంచి కె. కార్తికేయ శ్రీవాత్సవ్, వై. నిత్యశ్రీ, టి. సాహితి శ్రీవైష్ణవి, ఎస్. జశ్వంత్‌రెడ్డి ఎంపికైనట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల కరెస్పాండెంట్‌తో పాటు డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మ అభినందించారు.

కోదాడ విద్యార్థి..

కోదాడ: కోదాడ పట్టణంలోని జయ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న సీహెచ్. నందు కూడా సాక్షి స్పెల్‌బీలో పాల్గొని సెమీఫైనల్‌కు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వేణు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.